


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 111	ఎడిటర్ : డి.శివకృష్ణ	ఆదివారం	08-11-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 111	EDITOR : D.SHIVAKRISHNA	SUNDAY	08-11-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటికే..

ఎల్ నినోపై సీఎం సంచలన వ్యాఖ్యలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కష్టాలు ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండే బాధ్యత తనదని, అందరం కలిసికట్టుగా ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా తొలి రోజైన శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభించారు. అలాగే పారిశ్రామికవేత్తలతో సమావేశమై, హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

వారి మాటలు విని మోసపోవద్దు:

ఎల్ నినో విషయంలో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా కరువు వస్తే కేవలం తెలంగాణలోనే వచ్చినట్లు (మిగతా 2లో..)

డిండికి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదు

కల్వకుంట్ల కవిత..

స్టార్ త్రినేత్రం, నల్లగొండ:

ఏదుల నుంచి డిండికి నీళ్లు తీసుకురావడం అసాధ్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి నీళ్లను తీసుకువస్తేనే నల్లగొండ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు చేపడితే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డ్యామేజ్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ఇక, మహబూబ్ నగర్‌కు నీళ్లు ఇవ్వడానికే చాలా సమయం పడుతుందని, నల్లగొండకు నీళ్లు రావడం సాధ్యం కాదని తెలిపారు. శనివారం డిండి రిజర్వాయర్‌ను కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత మాట్లాడుతూ.. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెంకు నేరుగా గోదావరి నీళ్లు ఇవ్వవచ్చని చెప్పారు. తాము తీసుకొచ్చిన ప్రతిపాదన ఎలాంటిదో, ఎంత ఉపయోగకరమైనదో ఈ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుసుకోవాలని అన్నారు. అవసరమైతే ఇంజినీర్లతో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఎన్ఎల్‌బీసీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల సొరంగంలో కార్మికులు మృతిచెందారని ఆరోపించారు.



గత ప్రభుత్వం టన్నెల్‌ను కొంత నిర్లక్ష్యం చేసిందని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నట్లు కవిత చెప్పుకొచ్చారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానం తుపాకులగూడెం వద్దే జరగాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం (మిగతా 2లో..)

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం: మంత్రి శ్రీధర్‌బాబు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో ఆర్థాఫిన్‌టెక్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. (మిగతా 2లో..)

ఇందిరమ్మ ఇళ్లే నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు

స్టార్ త్రినేత్రం, సిద్దిపేట జిల్లా :

దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో

: మంత్రి పొన్నం ప్రభాకర్



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

దీపావళి తర్వాత తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్రలు

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

దీపావళి అనంతరం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' పేరుతో పాదయాత్రలు నిర్వహిస్తామని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఈ పాదయాత్రలకు జాతీయ నాయకులు ముఖ్య అతిథిలుగా రాబోతున్నట్లు ఆయన తెలిపారు.'రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే అడ్డుకుంటాం. నల్ల జెండాలతో మా నిరసనను వ్యక్తం చేస్తాం. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను రాహుల్ గాంధీ మోసం చేశాడు. భారత్ సమ్మిట్ నిర్వహణకు మేము వ్యతిరేకం కాదు. తెలంగాణకు పరిశ్రమలు, పెట్టుబడులు వస్తే మేము ఆహ్వానిస్తాం. కానీ రైతులను ఇబ్బంది పెడితే మాత్రం ఊరుకోము. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను పక్కనపెట్టి.. ఢిల్లీలో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి పద్ధతి కాదు. రైతులపై గల బాధ్యతలను మరచి.. రాష్ట్రం కేంద్రంపై నేరాలను నెట్టేందుకు ప్రయత్నిస్తోంది' అంటూ రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. (మిగతా 2లో..)

సిద్దిపేట జోలికి వస్తే ఊరుకోం..

సీఎం రేవంత్‌కు హరీష్ రావు ఘాటు కౌంటర్!

స్టార్ త్రినేత్రం, సిద్దిపేట :

మూడు సార్లు కాదు ముప్పై సార్లు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట మీద వెంట్రుక కూడ పీక లేడని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ వీ గ్రామ కమిటీల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన సిద్దిపేట వెటర్నరీ కాలేజీని కొడంగల్ కు తీసుకుపోయి నందుకు సీఎం రేవంత్ రెడ్డి



సిద్దిపేట విద్యార్థులకు క్షమాపణ చెప్పి సిద్దిపేటకు రావాలన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు రెండు పిల్లర్లు మరమ్మతులు చేసి రైతాంగానికి సాగు నీరు అందించకుండా సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. కన్నెపల్లి వద్ద మోటర్లు అన్ చేసి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ కు నీళ్లు ఇవ్వ వచ్చని చెప్పిన రిటైర్డ్ ఇంజనీర్‌లను మీకు బెల్ట్ ట్రీట్మెంట్ ఇస్తా, జైల్లో వేస్తా అని బెదిరిస్తున్న మూర్ఖుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే ఉద్యమకారులను తూపాకీతో (మిగతా 2లో..)

దీపావళి వేళ కాంగ్రెస్ నేతలకు గుడ్‌న్యూస్..

నామినేటెడ్ పోస్టులపై కీలక ప్రకటన



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. (మిగతా 2లో..)

రాజకీయాల్లోకి ధనుష్!..

బీజేపీలో చేరికపై ధనుష్ క్లారిటీ



తమిళనాడు :

తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ గత కొంతకాలంగా జోరందుకుంది. 'తమిళగ ఎళుచ్చి కళగం' పేరుతో ధనుష్ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ పేరును ఎన్నికల సంఘం వద్ద కూడా నమోదు చేయించుకున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ధనుష్ రాజకీయాల్లోకి (మిగతా 2లో..)

స్టార్ త్రినేత్రం,
సిద్దిపేట :

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/2025/A0438
అనుక్షణం అక్షరసత్యం తెలుగు దినపత్రిక

సిద్దిపేట జోలికి వస్తే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

కాల్చేస్తా అన్న చరిత్ర సీఎం రేవంత్ రెడ్డి దీ అన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవికీ, రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి నేటికి సగం మందికి రుణ మాఫీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్, బీజేపీ వాళ్ళు తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్వీ నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత స్టేడియం, ఎస్టీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్, అగ్రికల్చర్ బీఎస్సీ పర్మనెంట్ బిల్డింగ్, రింగ్ రోడ్డు, పంచాయతీరాజ్ రోడ్ల పనులను రద్దు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో 370 కేసులు ఉన్నాయి.. నా మీద కేసులు లేని పోలీసు స్టేషన్ లేదు.. కేసులకు భయపడే దీ లేదు.. ప్రభుత్వం పై పోరాటం ఆపే దీ లేదన్నారు. సిద్దిపేటకు పూర్వ వైభవం తిరిగి రావాలన్నా, ఆగిపోయిన పనులు మళ్లీ రాకెట్ వేగంతో పూర్తి కావాలన్నా రేవంత్ రెడ్డిని ఎంత త్వరగా ఇంటికి పంపితే రాష్ట్రానికి పట్టిన శని పీడ అంత తొందరగా పోతుందని హరీష్ రావు అన్నారు.

రాజకీయాల్లోకి ధనుష్!..

(మొదటిపేజీ తరువాయి)

రావడానికి బీజేపీ మద్దతు ఉందని, ఆయన్ను వెనుకుండి నడిపిస్తున్నది కమలం పార్టీనే అంటూ జరుగుతున్న ప్రచారంపై తాజాగా ఆయన స్పందించారు. తన వెనక ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు. తన తాజా చిత్రం 'ఓం' ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ధనుష్ ఈ అంశంపై మాట్లాడుతూ తన గురించి అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయని, కొందరు తన వెనుక ఉన్నారని, మరికొందరు తనకు మద్దతు ఇస్తున్నారని వార్తలు వస్తున్నాయని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. తనకు ఏ వ్యక్తి లేదా సంస్థ ప్రత్యేకంగా మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

నన్ను నడిపిస్తున్నది అతడే:

అయితే తనకు దేవుడి ఆశీస్సులు ఉన్నాయని, అభిమానులు తన వెనుక ఉన్నారని, ప్రజలు తనకు అండగా ఉన్నారని ధనుష్ తెలిపారు. దేవుడే తనను నడిపిస్తున్నాడని, అభిమానులు తనకు బలమని స్పష్టం చేశారు. ప్రజలే తనకు అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించకపోయినా, తనకు ఏ రాజకీయ పార్టీ ప్రత్యేక మద్దతు లేదనే విషయాన్ని ఆయన స్పష్టం చేయడం ద్రవిడ పాలిటిక్స్ లో ఆసక్తిని రేపుతోంది. కాగా ప్రజలకు ఎదురయ్యే చట్టపరమైన సమస్యలు, సామాజిక సమస్యలకు న్యాయ సలహాలను అందించేందుకు తమిళనాడు వ్యాప్తంగా 3 వేల మంది న్యాయ సలహాదారులను నియమించాలని, ఇందుకు సంబంధించిన వ్యవస్థను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని ధనుష్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో సినీ కెరీర్ లో దుమ్ము దులిపిన ధనుష్ భవిష్యత్ లో రాజకీయ రంగంలోనూ రప్ఫాడించబోతున్నారని ఆయన అభిమాను ధీమా వ్యక్తం చేస్తున్నారు.

డిండికి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)

రేసుగుర్రం అనుకుంటే కీలు గుర్రం అయ్యిందని, సీఎం రేవంత్ చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని కవిత కోరారు. మరోవైపు, పంటలు వేయొద్దంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమి ఇస్తుందో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

దీపావళి వేళ కాంగ్రెస్ నేతలకు గుడ్‌న్యూస్..

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తేలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు..

ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించడానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం మూడు రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం..

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతమైన మానవ వనరుల తయారీకి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్--2047 విజన్‌లో భాగంగా గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఉద్ఘాటించారు. బ్యాంకింగ్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్లలో ఆర్థాఫిన్‌టెక్ సేవలు అందిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ నివాసంలో దీపావళి సమ్మేళనానికి హాజరైన మధుయాష్కి గౌడ్

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఢిల్లీలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివానంలో ఏర్పాటు చేసిన 'దీపావళి సమ్మేళనా'నికి ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, పలువురు పార్టీ ముఖ్యనేతలందరితోనూ ఆత్మీయంగా మాట్లాడి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, ఆత్మీయ బంధాలను మరింత బలోపేతం చేసుకుంటూ.. దేశ ఐక్యత, ప్రజాస్వామ్యం, సమ్మిళిత భారతదేశ నిర్మాణం పట్ల మనకున్న ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించేందుకు ఇలాంటి వేడుకలు వేదికలవుతాయని మధుయాష్కి పేర్కొన్నారు.

ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లు తాగునీటికే..

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్నారని సీఎం మండిపడ్డారు. ఎల్ నినో వల్ల వర్షాలు లేక ప్రాజెక్టులు అడుగంటాయని, ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగేందుకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత మండిపోతాయని, బావ బామ్మర్దులు ఊర్లమీద పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు మోసపోవద్దని సూచించారు. వారి మాటలు నమ్మితే మట్టి పోని అంబలి కాచుకున్నట్లే అవుతుందని, రైతుల శ్రేయస్సును ప్రభుత్వం కోరుకుంటోంది కాబట్టి ఆరుతడి పంటలే వేయాలని కోరారు.

ఏపీకి నీళ్లు అబద్ధం:

మేడిగడ్డ వద్ద నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఏపీకి నీళ్లు వెళ్తున్నాయని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు అబద్ధం అని రేవంత్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ నేతలకు కనీన అవగాహన లేదని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీలు ఉంటేనే కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తగలమన్నారు. అన్నారం, సుందిళ్లలో గేట్లు దించే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు వని చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్ఆర్ మొదలుపెట్టిన ప్రాజెక్టులే ఇప్పుడు రైతులను, ఖమ్మం జిల్లాను ఆదుకుంటున్నాయని చెప్పారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు చేసినా ఒక్క పాలమూరు ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని, ప్రాణహిత-చేవెళ్లను పక్కన పెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి కట్టిన కాళేశ్వరం ఆయన హయాంలోనే కుప్పకూలిందని విమర్శించారు. వచ్చే డిసెంబర్‌లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశంలో ఎల్ నినో, కాళేశ్వరంపై చర్చిద్దామని.. మీరు వస్తారో మీ బంధువులు వస్తారో రండి అంటూ సవాల్ విసిరారు.

కొడంగల్ అభివృద్ధిపై కేటీఆర్‌కు కౌంటర్

వదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించిన సీఎం, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనాలు పెంచామని కేటీఆర్ కడుపు నిండా విషం నింపుకొని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ మనసు ఒప్పలేదని, కానీ తమ ప్రభుత్వం భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇస్తోందని తెలిపారు. ఢిల్లీ-నోయిడా తరహాలో హైదరాబాద్-లగచర్ల అభివృద్ధి చెందుతుందని, లగచర్లలో పెట్టుబడులకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. లగచర్ల భూముల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించినా, ఇప్పుడు అదే రైతులు ప్రభుత్వానికి భూములు ఇచ్చారన్నారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాల పెంపుపై కేటీఆర్ చేసిన విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని, అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు పరిహారం ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందిస్తోందని తెలిపారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

కేటీఆర్ ఎప్పటికీ రేవంత్ రెడ్డివి కాలేవు:

కేటీఆర్ వేషభాషలు మార్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే పులి కాదని సీఎం చురకలంటించారు. రేవంత్ రెడ్డికి గడ్డం ఉంది కాబట్టి తాను గడ్డం పెంచుకుంటే కేటీఆర్ ఎప్పటికీ రేవంత్ రెడ్డి కాలేడని, ఆయనకు గడ్డం రావడానికే 50 ఏళ్లు పట్టింది.. ఇక బుద్ధి రావడానికి ఇంకెన్నాళ్లు పడుతుందో అంటూ ఎద్దేవా చేశారు. తాను మూడేళ్లలో గంట కూడా సెలవు తీసుకోకుండా పని చేస్తున్నానని, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినందున ఈ అబద్ధాల కుటుంబాన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత





స్టార్ త్రినేత్రం, ఇబ్రహీంపట్నం:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచాల మండలం ఆరుట్ల, మంచాల బండలేమూరు, చెన్నారెడ్డి గూడ , పటేల్ చెరువు తండా గ్రామాలలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి చేతుల మీదుగా నిరుద్యోగులకు పోటీ పరీక్షలు సంబంధించిన ఉచిత స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది.... ఈ సందర్భంగా బూడిద రామిరెడ్డి మాట్లాడుతూ.. నేటి యువకులు రేపటి దేశ పౌరులు కాబట్టి యువకులు సమాజ పట్ల బాధ్యతాయుతంగా ఉండి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ద మిషన్ సీఐ ఏడుకొండల్, బుస్సు పుల్లారెడ్డి, చిందం రఘుపతి, ఫౌండేషన్ సభ్యులు పున్నం రాము, మంగ ఐలేష్, అశ్వల బాలరాజ్, కాట్రోత్ రాజు, నద్దాం హుస్సేన్, బి వెంకటేష్, షాకీర్ గణేష్, బాహుబలి, శివ, గ్యార శేఖర్, లింగం యాదవ్, మోహన్ జే, వెంకీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు

మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కలిసిన బండరావిరాల ప్రజాప్రతినిధులు



స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని బండరావిరాల గ్రామ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యూత్ ఫోర్స్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బండరావిరాల గ్రామ యువజన నాయకుడు గుండ్ల నతీష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రజా సమస్యలు, మౌలిక వసతులు, వివిధ అభివృద్ధి పనులతో పాటు పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ ముదిరాజ్ మరియు గ్రామ బీఆర్ఎస్ యూత్ ఫోర్స్ నాయకులు పాల్గొన్నారు.

మాధవ నగర్‌లో స్మైమ్ డెంటల్ కేర్ ప్రారంభం..

ఆధునిక దంత వైద్య సేవలు



స్టార్ త్రినేత్రం, కర్మన్ ఘాట్:

ఎల్బీనగర్ పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునిక దంత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కర్మన్‌ఘాట్ డివిజన్ మాధవ నగర్ కాలనీ రోడ్ నంబర్ 10లో స్మైమ్ డెంటల్ కేర్, మ్యాక్సిలోఫేషియల్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ హాజరయ్యారు. ఆసుపత్రి నిర్వాహకులు చిలువేరు అశోక్, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ కుమార్ చిలువేరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రంలో డెంటల్ ఇంప్లాంట్స్, రూట్ కెనాల్, బ్రేసెస్, ఓరల్ సర్జరీ, ఫేషియల్ ఎస్తెటిక్స్ తదితర ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిలువేరు శ్రీనివాస్, బొడ్ల మల్లికార్జున్ గుప్తా, మణిపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ముత్యాలు, కడారి రాజేష్ యాదవ్, సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, అడ్వకేట్ ప్రభాకర్ రెడ్డి తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/2025/A04328
అనుక్షణం నిక్షేపంగా తెలుగు దినపత్రిక

ఘనంగా అనాథ, పేద పిల్లలకు అల్పాహార వితరణ

దీపావళి వేళ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆదర్శనీయ సేవలు



స్టార్ త్రినేత్రం, వనస్థలిపురం:
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పేద, అనాథ పిల్లలకు ఉచిత అల్పాహార (టిఫిన్) వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా చిన్నారులు పాల్గొని సంతోషంగా అల్పాహారాన్ని స్వీకరించారు. పండుగ పూట తమకు కడుపు నిండా రుచికరమైన అల్పాహారం అందించినందుకు చిన్నారులు నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, దీపావళి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సమితి ప్రెసిడెంట్ డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. పండుగల వేళ పేదలు, అనాథల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే నిజమైన దీపావళి అని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు చేతనైన సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా నిరంతరం ఇలాంటి పరోపకార, సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా దాతలు సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే తమను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి స్కూల్‌లో ఘనంగా గ్రీన్ దీపావళి వేడుకలు



స్టార్ త్రినేత్రం, హనుమకొండ:
పర్యావరణ పరిరక్షణ, కాలుష్యరహిత దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసే లక్ష్యంతో గోపాల్‌పూర్‌లోని కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రీన్ దీపావళి వేడుకలను





ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "గ్రీన్ దీపావళి -- పర్యావరణ హితమే మా లక్ష్యం" అనే నినాదంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు చిత్రలేఖనం, కళాకృతులు, హస్తకళల ద్వారా తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్రచార వీడియోలను రూపొందించి ప్రదర్శించారు. మట్టి ప్రమిదల వినియోగం, బాణసంచాకు దూరంగా ఉండటం, మొక్కలు పెంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ పీజీ హెచ్ఎం నాగేశ్వర్ రావు ఇలి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి తాబేటి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగేశ్వర్ రావు అన్నారు. అనంతరం పాఠశాల బోధన, బోధనేతర సిబ్బందికి దీపావళి మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు దివ్య, మౌనిక, కావ్య, అమని, ఆయేషా, సమ్రీన్, శ్రావణి, రావళి, ఉమారాణి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం

స్టార్ త్రినేత్రం, వేములవాడ :
వేములవాడ పట్టణంలోని ఈరోజు మధ్యాహ్నం నిరాశ్రయులకు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు, భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రోజున అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం ఈ రోజు భక్తులకు పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నాధన్యవాదములు ఈ రోజు పురేల్ల వొజన్న జ్ఞాపకార్థం సందర్భంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు వారి కుమారుడు పురేల్ల గంగాధర్ వి ఆర్ ఫౌండేషన్ వాస్తవ్యులైనబొంబాయి ఈ కార్యక్రమం లో సాయి రూప ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎద్దండిరాజు-సరళ,బోడిగేరాజు,గోంటినవీన్,వాసాలహరిప్రసాద్ , వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఘనంగా దీపావళి సంబరాలు, రెడ్ కలర్ డే

పూల రంగోలి, ప్రమిదల వెలుగులతో ఆకట్టుకున్న చిన్నారులు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: స్కూల్ డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి

స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:
కోహెడ గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో శనివారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు, 'రెడ్ కలర్ డే' కార్యక్రమాలను అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ పండుగ శోభతో పాటు చిన్నారుల ఉత్సాహంతో సందడిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాలలో చిన్నారులు బంతిపూలతో తీర్చిదిద్దిన ఆకర్షణీయమైన పూల రంగోలి, మధ్యలో వెలిగించిన దీపపు ప్రమిదలు, "హ్యాపీ దివాళి టు ఆల్" అంటూ రూపొందించిన ప్రత్యేక చార్ట్ బోర్డులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ అల్లం రత్నా రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం పండుగలకు, విశిష్ట సంప్రదాయాలకు పుట్టినిల్లని అన్నారు. దీపావళి అంటే కేవలం బాణసంచా కాల్చడం మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, సమాజంలో నెలకొన్న అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి విజ్ఞానపు వెలుగులు నింపడమే ఈ పండుగ పరమార్థమని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువల ప్రాముఖ్యతను నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. పుస్తకాల్లోని చదువుతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంపొందించేందుకు 'కలర్స్ డే' వంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఎరుపు రంగు ప్రేమ, ధైర్యం, ఉత్సాహానికి నిదర్శనమని వివరించారు. విద్యార్థులంతా పర్యావరణానికి హాని కలగకుండా హరిత దీపావళి (గ్రీన్ దివాళి) జరుపుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా వేడుకలు చేసుకోవాలని రత్నారెడ్డి సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు ఉపాధ్యాయులతో కలిసి సంప్రదాయ రీతిలో దీపాలు వెలిగించి ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. మహేశ్వర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) జైపాల్ రెడ్డి, ఏవో శివ, క్యాంపస్ మేనేజర్ మరీని చంద్రశేఖర్, రెసిడెన్షియల్ కో-ఆర్డినేటర్ డి. కిరణ్ బాబు, సోషల్ స్టడీస్ సీనియర్ టీచర్ తోటపల్లి ఆశీర్వాదం, సోషల్ సైన్స్ విభాగం సైరా బాను, ఇంగ్లీష్ విభాగ ఉపాధ్యాయులు వెంకటేష్, రాజేంద్ర, నరేష్, రిసెప్షనిస్ట్ కల్పన, హాస్టల్ వార్డెన్లు, సీనియర్ ఉపాధ్యాయులు, బోధన మరియు బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పీల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతపై అవగాహన
సంప్రదాయాలు, ఆచారాలపై ప్రత్యేక వివరణ
దీపం,ఓం,స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులతో విద్యార్థుల కనువిందు
చెడుపై మంచి, చీకటిపై వెలుగు విజయానికి ప్రతీక దీపావళి
ఆనందంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి



స్టార్ త్రినేత్రం, పర్వతగిరి:
పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని వల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యత, దాని వెనుక ఉన్న ఉద్దేశం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ దీపావళి వెలుగుల పండుగ అని, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. దీపాలు వెలిగించడం ద్వారా ఇళ్లలోనే కాకుండా మన ఆలోచనల్లోనూ మంచి వెలుగును నింపుకోవాలని విద్యార్థులకు సూచించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ బంధాలను గుర్తు చేస్తాయని పేర్కొన్నారు.చదువుతో పాటు మన పండుగల విశిష్టత, వాటి వెనుక ఉన్న సందేశాలు, ఆచారాల గురించి కూడా విద్యార్థులు తెలుసుకోవడం అవసరమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పెద్దలు పాటించే మంచి సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. దీపావళి వేడుకలను ఆనందంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణం, ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దీపం, ఓం, స్వస్తిక్, పీఎంఎస్ ఆకృతులను అందంగా రూపొందించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు పండుగ విశేషాలను ఆసక్తిగా తెలుసుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కొటగిరి రమేష్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో వెలిగే ప్రతీ దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలి...

అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులందరూ భాగస్వాములు కావాలి...
ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం...
ఎంపీడీవోలు, సెక్రటరీలు, జీపీవోలతో ఎమ్మెల్యే వర్చువల్ మీటింగ్...


స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:
"మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో లబ్ధిదారుల నివాసాల్లో వెలిగించే ప్రతీ దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమంపై శనివారం తొర్రూర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో ఎమ్మెల్యే వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొనగా... వారికి మల్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. పేదప్రజల జీవిత స్వప్నం సాకారమైన వేళ... ప్రతీ లబ్ధిదారుడి కుటుంబంలో వెలుగులు నింపే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లలో దీపాలు వెలిగి, ప్రతి కుటుంబంలో పండగ ఆనందం కనిపించాలని తెలిపారు. పూర్తైన ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయాలన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది, ఇందిరమ్మ కమిటీల సభ్యులంతా ఊరూవాడన ఇందిరమ్మ ఇళ్లలో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకతతో ముందుకుసాగుతున్నట్లు మల్‌రెడ్డి చెప్పారు



తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు

తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్


స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:
తెలంగాణ ఎస్టీ, ఎస్సీ కమిషన్ చట్టం 2003ను రద్దు చేస్తూ 2026 చట్టం తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ గిరిజన సమైక్య హర్షశీ వ్యక్తం చేసింది.ఎస్సీ ఎస్టీ కమిషన్లను వేర్వేరు ఏర్పాటు చేయడం చారిత్రక నిర్ణయమని తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బానోత్ బిక్షం నాయక్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజన సంఘాలు చేస్తున్న డిమాండ్ ని గుర్తించి వారి అంశాలను అనుగుణంగా వేర్వేరు కమిషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు గిరిజన సమాజం కృతజ్ఞతలతో ఉంటుందని అన్నారు.దీని వలన పరదర్శకత ఉంటుందని,గిరిజనులు సమస్యల పరిష్కారానికి మార్గం సులభం అవుతుంది అని. అన్నారు. ఉమ్మడిగా ఉండటం వలన కొంత మేరకు ఎస్టిలకి కమిషన్ కి దూరం పెరిగిందని అందుకే గిరిజన సమాజము ప్రత్యేకమైన కమిషన్ కొరకు అనేక యేండ్లుగా పోరాటాలు నిర్వహిస్తుందని ఇప్పుడు ఆ పోరాట ఫలితం వచ్చిందని అన్నారు ప్రభుత్వం ఇంతటితో చేతులు దులుపుకోకుండా సమాజంలో చిన్న చూపుకి గురైతున్న గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం,వారి అభివృద్ధి కోసం కృషి చేయాలనీ, రాజకీయ ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు గిరిజన జాతి ఆత్మ గౌరవంతో బతికే పరిస్థితులు రావాలని అన్నారు.



స్టార్ తినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం నిక్షిప్తమయం తెలుగు దినపత్రిక

నాగచైతన్య -వృషకర్మ-కు ఆ ఇద్దరూ పోటీనా?

నాగచైతన్య నటించిన పీరియాడిక్ థ్రిల్లర్ 'వృషకర్మ' డిసెంబర్ 4న విడుదల కానుంది. అదే రోజున సల్మాన్ ఖాన్ 'మాతృభూమి', శ్రద్ధా కపూర్ 'ఈత' చిత్రాలు కూడా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అయితే 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కించిన 'వృషకర్మ'పై తెలుగు రాష్ట్రాల్లో భారీ అంచనాలు ఉన్నాయి. వినూత్న కథాంశం, మేకింగ్‌తో ఈ సినిమా మంచి ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. టాలీవుడ్ యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ పీరియాడిక్ థ్రిల్లర్ -వృషకర్మ- డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఇదే తేదీకి బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన -మాతృభూమి-తో పాటు, శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో రూపొందిన -ఈత- (హిందీ) చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద పోటీకి దిగుతుండటంతో సినీ వర్గాల్లో



తీవ్ర ఆసక్తి నెలకొంది. సల్మాన్ ఖాన్, శ్రద్ధా కపూర్ వంటి బిగ్ స్టార్ల చిత్రాలు రేసులో ఉన్నా కానీ.. వీటి ప్రభావం మెట్రోల్లో మల్టీప్లెక్సుల వరకే.. తెలుగు రాష్ట్రాల్లో నాగచైతన్యకు ఉన్న బలమైన ఫ్యాన్ బేస్.. ఇటీవలి సక్సెస్ రేటు.. సినిమాపై ఉన్న విపరీతమైన క్యూరియాసిటీ కారణంగా -వృషకర్మ- అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కంటెంట్ పరంగా -వృషకర్మ- మిగిలిన రెండు చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన పీరియాడిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. గతంలో -విరూపాక్ష- చిత్రంతో మిస్టరీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను తెరపై ఆవిష్కరించి బాక్సాఫీస్ వద్ద రికార్డు విజయాన్ని అందుకున్న దర్శకుడు కార్తీక్ వర్మ దండు.. ఇప్పుడు మరింత వినూత్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అతిపెద్ద ప్లస్ పాయింట్‌గా విశ్లేషిస్తున్నారు. ప్రాచీన నమ్మకాలు..మిస్టరీ.. అడ్వెంచర్ నేపథ్యంతో కూడిన విజువల్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని నిర్మాతలు అత్యంత నమ్మకంతో ఉన్నారు. స్క్రిప్ట్ డిజైన్ - మేకింగ్ స్థాయిలోను విరూపాక్షను మించిన హంగులతో ఈ సినిమాను రూపొందించడం బిజినెస్ వర్గాల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ప్రస్తుత సినిమా వాతావరణంలో టాలీవుడ్, బాలీవుడ్ అనే ప్రాంతీయ భేదాలు పూర్తిగా చెరిగిపోయాయి. దక్షిణాది నుండి వస్తున్న వైవిధ్యమైన, నాణ్యమైన కంటెంట్‌ను ఉత్తరాది ప్రేక్షకులు విపరీతంగా ఆదరిస్తున్నారని గడిచిన కొన్నేళ్ల బాక్సాఫీస్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో నాగచైతన్య మార్కెట్ పరిధి కూడా పాన్-ఇండియా స్థాయిలో పెరుగుతోంది. సల్మాన్ ఖాన్ లేదా మరో స్టార్ హీరో సినిమా వచ్చిందంటే ఇతర సినిమాలను చూడకూడదనే పాత ఆలోచనా విధానం (మీమాంశ) ప్రేక్షకులలో ఇప్పుడు లేదు. మంచి కంటెంట్ ఉంటే అన్ని భాషల ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్న తరుణంలో.. మారిన ఈ పాన్-ఇండియా ట్రెండ్ -వృషకర్మ- చిత్రానికి అన్ని విధాలా కలిసివస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓం రౌత్‌ని పదే పదే టార్గెట్ చేస్తున్నప్రభాస్ ఫ్యాన్స్

నితీష్ తివారీ తెరకెక్కించిన 'రామాయణం పార్ట్-1' విజువల్స్‌పై ప్రశంసలు వస్తుండటంతో దర్శకుడు ఓం రౌత్‌పై ప్రభాస్ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ప్రభాస్‌తో ఆయన రూపొందించిన 'ఆదిపురుష్'లో రామాయణాన్ని తెరకెక్కించిన తీరును తప్పుబడుతున్నారు. వానరులను గొరిల్లాలుగా చూపించడం, గ్రాఫిక్స్, శ్రీరాముడి పాత్ర చిత్రణలో లోపాలు ఉన్నాయని మండిపడుతున్నారు. 'రామాయణం' చూస్తుంటే 'ఆదిపురుష్'లో జరిగిన తప్పులు గుర్తొస్తున్నాయని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.నితీష్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కిన -రామాయణం పార్ట్-1- ప్రపంచవ్యాప్తంగా విడుదలై విజువల్ గ్రాండియారిటీ పరంగా మెప్పు పొందిన సంగతి తెలిసిందే. ఎమోషన్స్ మిస్సయ్యాయని విమర్శలు వచ్చినా సాంకేతికంగా అద్భుతంగా ఉందని ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ తరుణంలోనే బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్‌పై నెటిజన్లు-ప్రభాస్ అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శల దాడికి తెర తీసారు. రామాయణాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో..సనాతన సాంప్రదాయాల శోభ చెడకుండా ఎలా తెరకెక్కించ వచ్చో నితీష్ తివారీ నిరూపించారని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదే సమయంలో గతంలో శ్రీరాముడి కథాంశంతో ప్రభాస్ కథానాయకుడిగా ఓం రౌత్ రూపొందించిన -ఆదిపురుష్- విఫలమైన తీరును గుర్తుచేస్తూ ఫ్యాన్స్ మీడియా ఎదుట విరుచుకు పడుతున్నారు. ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ కెరీర్‌ను ఓం రౌత్ -ఆదిపురుష్- రూపంలో దెబ్బతీశారని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పౌరాణిక ఇతిహాసాన్ని తెరకెక్కించే సమయంలో ప్రజల విశ్వాసాలను, ఆలోచనా విధానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా పవిత్రమైన రామాయణంలో వానరాలకు బదులుగా గొరిల్లాలను చూపించడం.. హాలీవుడ్ స్టైల్ డార్క్ షేడ్స్‌ను అనుకరించడం వంటి నిర్ణయాలు సినిమా ఆత్మను దెబ్బతీశాయని వారు ప్రధానంగా వేలెత్తి చూపుతున్నారు. -రామాయణం-లాంటి ఒక



నిజమైన విజువల్ గ్రాండియర్ కాన్సెప్టులో ప్రభాస్ నటించి ఉంటే ఆయన రేంజ్ మరోలా ఉండేదని ఫ్యాన్స్ భావిస్తున్నారు.అంతేకాకుండా శ్రీరాముడిగా ప్రభాస్ క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడంలో ఓం రౌత్ పూర్తిగా విఫలమయ్యారనేది నెటిజన్ల అభిప్రాయం. అంతటి విగ్రహపుష్టి, గాంభీర్యం ఉన్న నటుడిని సరిగ్గా ఉపయోగించు కోకుండా విజువల్ ఎఫెక్ట్స్- గ్రాఫిక్స్ పేరుతో ప్రభాస్ ఇమేజ్‌ను తగ్గించేశారని అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామాయణం రిలీజ్ అయిన తర్వాత థియేటర్లలో కనిపించిన సాంకేతిక పరిణతిని చూసిన ఫ్యాన్స్.. ఆదిపురుష్ చిత్రంలో జరిగిన సాంకేతిక లోపాలను.. రామాయణ ఇతిహాసాన్ని వక్రీకరించిన తీరును తలచుకుంటూ మీడియా - సోషల్ మీడియా వేదికలలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆదిపురుష్ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎదుర్కొన్న ఘోర పరాజయం.. ఎదుర్కొన్న ప్రతికూల విమర్శల దెబ్బ నుంచి దర్శకుడు ఓం రౌత్ ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేక పోయారనేది చిత్ర పరిశ్రమలో చర్చ. ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వంలో మరే పెద్ద ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కకపోవడం లేదా విడుదల కాకపోవడం గమనార్హం. ధనుష్ కథానాయకుడిగా భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జీవిత ఆధారంగా తెరకెక్కించిన -కలామ్: ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా- బయోపిక్‌కు మాత్రమే ఆయన దర్శకత్వం వహించగా.. కొన్ని చిత్రాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఊహించని రీతిలో -ఆదిపురుష్- ఇచ్చిన భారీ షాక్ నుంచి ఓం రౌత్ కెరీర్ ఇప్పటికీ కోలుకోలేకపోవడమే కాకుండా... రామాయణ ఆధారిత కొత్త సినిమాలు వచ్చిన ప్రతిసారీ అతడు చేసిన తప్పులు మళ్లీ మళ్లీ చర్చనీయాంశమవుతున్నాయి. ఒక గొప్ప పౌరాణిక కథను సరైన విజువల్ విజన్‌తో తెరకెక్కించక పోతే ఎలాంటి ఫలితం ఉంటుందో చెప్పడానికి -ఆదిపురుష్- ఒక ఉదాహరణగా నిలవగా.. -రామాయణం- వంటి చిత్రాలు విజువల్ స్టాండర్డ్స్‌కు కొత్త కొలమానాలను నిర్దేశిస్తున్నాయనే చర్చ సాగుతోంది.

థియేటర్ల వ్యాపారంలో స్టార్ హీరో 600 కోట్లు పెట్టుబడి!



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ థియేటర్ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. తన పిల్లలు నైసా, యుగ్ పేర్లతో ప్రారంభించిన NY Cinemas ద్వారా ఇప్పటికే 25కి పైగా మల్టీప్లెక్స్‌లలో 80కి పైగా స్క్రీన్లను నిర్వహిస్తున్నారు. రాబోయే 2-3 ఏళ్లలో 250 స్క్రీన్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాజాగా తెలంగాణ, ఏపీ సీఎం లను కలసి హైదరాబాద్, వరంగల్, అమరావతి, విశాఖ పట్నం సహా పలు నగరాల్లో మల్టీప్లెక్స్‌ల ఏర్పాటుపై చర్చించినట్లు కథనాలు వస్తున్నాయి. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అగ్ర నటుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేసిన అజయ్ దేవగన్, ఇప్పుడు థియేటర్ ఎగ్జిబిషన్ రంగంలో కూడా సరికొత్త విప్లవాన్ని తీసుకువస్తున్నారు. తన బిడ్డలు నైసా యుగ్ (బన్నీ) పేర్ల మొదటి అక్షరాల కలయికతో అనే మల్టీప్లెక్స్ చైన్‌ను ఆయన స్థాపించారు. కేవలం నటుడిగానే కాకుండా ఒక వ్యాపారవేత్తగా సినిమా ప్రదర్శన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా దేవగన్ ఈ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ప్రేక్షకులకు ప్రపంచస్థాయి థియేట్రికల్ అనుభూతిని అందించాలనే ధ్యేయంతో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో స్క్రీన్లను నిర్మిస్తున్నారు. అమెరికా ఎన్నికల ఎఫెక్ట్.. భారత స్టాక్ మార్కెట్లలో భారీ ర్యాలీ.. ఇన్వెస్టర్ల కు రూ.6 లక్షల కోట్ల లాభం! ప్రస్తుతం -ఎన్.వై. సినిమాస్- నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటివరకు భారత్‌లోని దాదాపు 25కి పైగా మల్టీప్లెక్స్ థియేటర్లలో 80కి పైగా ఆపరేషనల్ స్క్రీన్లతో పాటు.. కొన్నిటిని నిర్మాణ దశకు ఈ సంస్థ చేర్చింది. రానున్న 2 నుండి 3 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా మొత్తం 250 స్క్రీన్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. టైర్-1 మెట్రో నగరాలతో పాటు ప్రధానంగా సినీ వినోదం తక్కువగా అందుబాటులో ఉన్న టైర్-2, టైర్-3 నగరాల పరిధిలో మల్టీప్లెక్స్ రంగాన్ని విస్తరించడం ద్వారా ప్రేక్షక వర్గాన్ని మరింత పెంచవచ్చని అజయ్ దేవగన్ ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. మెట్రోలు- ప్రధాన పట్టణాలలో ఎన్.వై. సినిమాస్ ఇప్పటికే తమ ఉనికిని చాటుకుంది. ముంబైలోని చారిత్రాత్మక సిటీలైట్ థియేటర్ స్థానంలో 3 స్క్రీన్‌లు, డాల్బీ అట్మాస్ సౌండ్‌తో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించడంతో పాటు.. గురుగ్రామ్‌లో 4-స్క్రీన్ల అల్ట్రా-లగ్జరీ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో 6 స్క్రీన్‌ల భారీ మల్టీప్లెక్స్‌తో పాటు అహ్మదాబాద్, ఆనంద్, సురేంద్రనగర్, పంజాబ్‌లోని భటిండా, రాజస్థాన్‌లోని రతన్ ఘర్, .. యూపీలోని కాన్పూర్ వంటి నగరాల్లో తమ థియేటర్ల చైన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ థియేటర్లలో నాణ్యమైన సౌండ్, లగ్జరీ సీటింగ్, సరికొత్త ఎంటర్‌టైన్‌మెంట్ కాన్సెప్ట్‌లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ భారీ విస్తరణ ప్రాజెక్ట్ కోసం అజయ్ దేవగన్ సుమారు 500 కోట్ల నుండి 600 కోట్ల వరకు పెట్టుబడులను కేటాయించినట్లు వ్యాపార వర్గాల రిపోర్టులు చెబుతున్నాయి. ఈ సంస్థకు అజయ్ దేవగన్ ఫౌండర్ కం ప్రమోటర్‌గా వ్యవహరిస్తుండగా.. రాజీవ్ శర్మ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా మల్టీప్లెక్స్‌లను నిర్మించే క్రమంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లు, మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్ యజమానులతో లాంగ్-టర్మ్ లీజింగ్ లేదా రెవెన్యూ షేరింగ్ మోడల్ ఆధారంగా భాగస్వామ్యాలు కుదుర్చుకుంటూ వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.ఉత్తరాదిన సక్సెస్ సాధించిన అనంతరం, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో తమ చీ సినిమాస్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించాలని అజయ్ దేవగన్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్. రేవంత్ రెడ్డిని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడిని కలిశారు. హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్లు, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలతో పాటు.. ఏపీ రాజధాని అమరావతిలో ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌లు... విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలలో అధునాతన మల్టీప్లెక్స్‌లు నిర్మించడానికి ప్రభుత్వ అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పనపై వారు చర్చలు జరిపినట్లు కథనాలొస్తున్నాయి.

ఔత్సాహిక నటీమణులకు ఈ నటి జర్నీ పర్ఫెక్ట్ కేస్ స్టడీ

బాలీవుడ్ నటి కృతి సనన్ తన 12 ఏళ్ల కెరీర్‌లో ఇప్పటివరకు బికినీలో నటించలేదని, ఇటీవల వచ్చిన 'కాక్‌టైల్ 2'లోనే తొలిసారి ఆ సన్నివేశంలో కనిపించానని వెల్లడించారు. కెరీర్ ప్రారంభంలో ఇలాంటి సన్నివేశాల్లో నటించేందుకు సౌకర్యంగా ఉండేది కాదని తెలిపారు. వయస్సు, అనుభవంతో పాటు తనపై తనకు నమ్మకం పెరిగిందని, శరీరాకృతి కంటే ఆత్మవిశ్వాసమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. బికినీ వేయమని లేదా హద్దుమీరి ఎక్స్ పోజ్ చేయాలని దర్శకనిర్మాతలు ఒత్తిళ్లు తెస్తే వెంటనే దానికి ఒప్పుకోవాలా? కొందరు కథానాయికలకు ఈ విషయంలో అభ్యంతరాలున్నాయి. బోల్డ్ ఫోటోషూట్లు లేదా మితిమీరిన గ్లామర్ ఎలివేషన్‌కి అందరూ అంగీకరించలేరు. బాలీవుడ్ లో 12 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రముఖ నటి కృతి సనన్ ఇటీవల జాతీయ మీడియా వేదికగా తన వ్యక్తిగత ఎదుగుదల- ఆత్మవిశ్వాసంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తను కెరీర్ ఎప్పుడో ప్రారంభించినా కానీ, ఇటీవల వచ్చిన -కాక్‌టైల్ 2-లో తప్ప బికినీలో నటించలేదని కృతి తెలిపారు. ఈ చిత్రంలోని బికినీ సీన్ గురించి ప్రస్తావిస్తూ.. గ్లామర్ రంగంలో ఒక నటిగా



తన ఆలోచనా విధానం కాలక్రమేణా ఎలా మారిందో స్పష్టంగా చెప్పుకొచ్చారు. కృతి సనన్ తన వ్యాఖ్యలలో ప్రధానంగా మానసిక పరిణతికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎనిమిదేళ్ల క్రితం తన కెరీర్ ప్రారంభ దశలో ఇటువంటి సన్నివేశంలో నటించాల్సి వస్తే తాను ఎంతమాత్రం సౌకర్యవంగా ఫీలయ్యేదాన్ని కానని ఓపెన్‌గా అంగీకరించారు. వయస్సు పెరగడం.. పరిశ్రమలో సంపాదించిన అనుభవం.. స్వీయ వ్యక్తిత్వంపై ఏర్పడిన నమ్మకమే ఈ రోజు తనను ఈ స్థాయి సెల్ఫ్ అగ్రీ దిశగా నడిపించాయని వివరించారు. శరీర ఆకృతి గురించి మాట్లాడుతూ కృతి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. కేవలం శారీరక దారుఢ్యం కలిగి ఉండటం కంటే.. ఒక వ్యక్తి తన శరీరంలో పూర్తి సహజంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే అత్యంత కీలకమైన అంశమని నొక్కి చెప్పారు. బాహ్య సౌందర్యం కంటే అంతర్గత ఆత్మవిశ్వాసమే నిజమైన సౌకర్యాన్ని.. ధైర్యాన్ని అందిస్తుందని కృతి సనోన్ అభిప్రాయపడ్డారు.అంతేకాకుండా.. నటన - కెరీర్ విషయంలో తనకు తానే అతిపెద్ద విమర్శకురాలినని కృతి పేర్కొన్నారు. ప్రతీ సినిమా పూర్తయిన తర్వాత తన ప్రదర్శనను నిశితంగా విశ్లేషించుకుంటూ.. లోపాలను సరిదిద్దుకుంటూ మరింత మెరుగ్గా రాణించేందుకు నిరంతరం ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ గ్రోత్ మైండ్‌సెట్ వల్లనే తాను నటిగా.. వ్యక్తిగా నిలకడైన పురోగతి సాధించగలిగానని వెల్లడించారు. కృతి సనన్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొనే బాడీ ఇమేజ్ ఒత్తిడులు, వ్యక్తిగత ఎంపికల స్వేచ్ఛ.. వయస్సుతో పాటు వచ్చే ఆత్మవిశ్వాసంపై సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి. పరిశ్రమలోని ప్రమాణాల కోసం కాకుండా..తమ మానసిక సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకోవడం ఎంత అవసరమో ఔత్సాహిక నటీమణులకు అర్థమయ్యేలా కృతి చెప్పారు. కృతి తదుపరి మడాక్ ఫిలింస్ లో హారర్ చిత్రంలో నటిస్తోంది. భేధియా 2 లోను నటిస్తోంది.

బుకింగ్స్ లో 'రామాయణ' సెన్సేషన్.. వరుసగా రెండో రోజు కూడా రికార్డు!

బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీరా కపూర్ హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కించిన భారీ విజువల్ వండర్ నే రామాయణ. ఎన్నో అంచనాలు సెట్ చేసుకుని వచ్చిన ఈ సినిమా భారీ ఓపెనింగ్స్ ని సాధించి ఈ ఏడాదిలో మరో రికార్డు సెట్ చేసింది. అయితే ఇండియా వరకు రిలీజ్ అయ్యిన రోజే 24 గంటల్లో 1 మిలియన్ కి పైగా టికెట్ సేల్స్ ని జరుపుకొని అదరగొట్టిన ఈ సినిమా రేర్ ఫీట్ ని సెట్ చేసింది. తెలుగు సినిమా వార్తలు ఒక్క బుక్ మై షో నుంచే రామాయణ సినిమా 1 మిలియన్ బుకింగ్స్ ని క్రాస్ చేయగా ఇప్పుడు వరుసగా రెండో రోజు కూడా 1 మిలియన్ టికెట్ సేల్స్ ని క్రాస్ చేసి రెండో రోజు కూడా సెన్సేషన్ ని సెట్ చేసింది. దీనితో ఆదరణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ వారాంతం శనివారం, ఆదివారం బుకింగ్స్ కూడా మరింత లెవెల్లో ఉంటాయి. ఇక వసూళ్లు ఏ స్థాయిలో ఉంటాయో చూడాలి. ఇక ఈ సినిమాకి రెహమాన్, హన్స్ జిమ్మర్ లు సంగీతం అందించగా నమిత్ మల్హోత్రా నిర్మాణం వహించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com